క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ



స్టేషన్‌ఘన్‌పూర్: విద్యాశాఖ మండల నోడల్ అధికారిగా మండలంలోని ఛాగల్లు జెడ్పీ ఎస్ఎస్ హెచ్ఎంగా పనిచేస్తున్న జి.కొము రయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో మండల నోడల్ అధికారిగా పనిచేసిన ఎండీ.అజామోహినొద్దీన్ బదిలీపై వెళ్లగా కొమురయ్య సోమవారం బాధ్యతలు చేప ట్టారు. ఈ సందర్భంగా నూతన మండల నోడల్ అధికారికి ఎంఆర్‌సీ సిబ్బంది పుష్పగు చ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. ఎం ఆర్‌సీ సిబ్బంది తిరుపతి, గిరి, లవన్, జ్యోతి, శ్రీలత, రామతులసి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మండల నోడల్ అధికారిగా రాజేందర్



జనగామ రూరల్: మండల నోడల్ అధికారిగా వంగాల రాజేందర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జనగామ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఎఫ్ఆర్ఎస్‌లో విద్యార్థుల రిజిస్ట్రేషన్లు, అటెండెంట్స్, ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్, యూడైస్, ఆధార్ రిజిస్ట్రేషన్‌పై వివరించారు. ఉపాధ్యాయులందరూ సమయపాలన పాటించి బాధ్యతాయుతంగా, జవాబు దారితనంగా ఉంటూ విద్యార్థుల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. 10వ తరగతిలో 100 శాతం మార్కులు సాధించాలని కోరారు. ఎస్ఓ తోట రాజు, ఏఎస్ఓ రమేష్, శ్రీనివాస్‌రావు, ఉప్పలయ్య, వీరాంజని తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన నాయబ్ తహసీల్దార్

లింగాలఘణపురం: మండల తహసీల్దార్ కార్యాలయంలో గత కొంత కాలంగా ఖాళీగా ఉన్న నాయబ్ తహసీల్దార్ పోస్టు ఎట్టకేలకు భర్తీ అయ్యింది. జనగామ ఆర్డీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న మహ్మద్ అబ్దుల్ షాకీర్ లింగాలఘణపురం నాయబ్ తహసీల్దార్‌గా పదోన్నతిపై వచ్చి సోమవారం విధుల్లో చేరారు. అదేవిధంగా ఇక్కడి ఎంఆర్ఐ వెంకటేశ్వర్లు జనగామకు బదిలీ కాగా నర్మెటలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న కిశోర్ ఇక్కడికి, ఇక్కడ సీనియర్ అసిస్టెంట్‌గా పని చేసిన శ్రీనివాస్ రఘునాథపల్లికి బదిలీ కాగా బచ్చన్నపేటలో ఆర్ఐగా విధులు నిర్వహిస్తున్న భగత్ లింగాలఘణపురం సీనియర్ అసిస్టెంట్‌గా వచ్చారు. జనగామలో ఏఆర్ఐగా పని చేసిన రాకేశ్ లింగాలఘణపురం ఏఆర్ఐగా బదిలీపై వచ్చారు.

దేవరుప్పులలో..



దేవరుప్పుల: మండల నాయబ్ తహసీల్దార్‌గా దొపతి నవీన్‌కుమార్ విధుల్లో చేరారు. ఇటీవల ఇక్కడ పనిచేసిన నాయబ్ తహసీల్దార్ ఎడ్ల రవీందర్‌రెడ్డి పదోన్నతిపై నల్లగొండ జిల్లా చుండూరు తహసీల్దార్‌గా బదిలీపై వెళ్లారు. ఈయన స్థానంలో బదిలీపై వచ్చిన నవీన్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు ఉన్నతాధికారుల ఆదేశాలతో శాఖపరంగా అన్ని వర్గాలకు అభ్యున్నతి కోసం పాటుపడుతామన్నారు.

12న వాహనాల వేలం

పాలకుర్తి: వివిధ కేసుల్లో పట్టు బడిన మూడు వాహనాలకు ఈనెల 12న వేలం నిర్వహించనున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ బి. సంతోష్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 12న ఉదయం పాలకుర్తి ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ ఆవరణ రెండు ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోకు వేలం వేయనున్నట్లు చెప్పారు.

బీసీ సంక్షేమ సంఘం మండల కమిటీ



నియామకపత్రాలతో రాజన్‌బాబు, శ్రవణ్

చిల్పూరు: బీసీ సంక్షేమ సంఘం మండల కమిటీని సోమవారం మండల కేంద్రంలోని చిల్పూరుగుట్ట వద్ద సంఘం జిల్లా అధ్యక్షుడు సిద్ధయ్య, నియోజకవర్గం ఇన్‌చార్జ్ గంటె ఉపేందర్ యాదవ్ ప్రకటించారు. అధ్యక్షుడిగా బత్తుల రాజన్‌బాబు (చిన్నపెండ్యాల), యువజన అధ్యక్షుడిగా రాజవరానికి చెందిన ముక్కెర శ్రవణ్‌ను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా పద్మశాలి సంఘం బాధ్యులు ఎన్నికైన వారిని సన్మానించారు. ఈ క్యార్యక్రమంలో పేరాల రాజమౌళి, చంద్రమౌళి, కుమారస్వామి, రాజన్‌బాబు, సత్యనారయణ, రాజు, యుగందర్, ప్రభాకర్, వెంకటేశ్వర్లు, సుధాకర్, రవి, వేణు, రమేష్, సంపత్, అశోక్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్‌తోనే గ్రామాల అభివృద్ధి



నర్మెట: అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ప్రజాప్రతినిధులు



జఫర్‌గఢ్: పనుల ప్రారంభోత్సవంలో ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు

నర్మెట: ముఖ్యమంత్రి కేసీఆర్‌తోనే గ్రామాలు అభివృద్ధికి నోచుకున్నాయని ఎంపీపీ తేజావత్ గోవర్ధన్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రామిని శివరాజ్, ఎంపీటీల ఫోరం అధ్యక్షుడు కల్యాణం మురళి అన్నారు. మండల కేంద్రంలో రూ.19.70 లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, రూ. 5 లక్షలతో పద్మశాలి కమ్యూనిటీ హాల్ నిర్మాణం, మచ్చుపహాడ్‌లో రూ. 40 లక్షలతో సీసీరోడ్లు, మురుగు కాల్వలు, హన్మంతాపూర్‌లో రూ. 5 లక్షలతో యాదవ కమ్యూనిటీ హాల్ నిర్మాణం, రూ.10 లక్షలతో సీసీరోడ్ల నిర్మాణానికి సోమవారం భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ ఎండి గౌస్, సర్పంచ్‌లు ఆమెడపు కమలాకర్‌రెడ్డి, పగడాల విజయ నర్సయ్య, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు చింతకింది సురేష్, ఉపసర్పంచ్ గోపగోని శ్రీనివాస్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



దేవరుప్పుల: రాజుపల్లిలో జీపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

కమ్యూనిటీహాళ్ల నిర్మాణ పనులు ప్రారంభం

జఫర్‌గఢ్: ఉప్పుగల్లులో ఎమ్మెల్సీ కడియం శ్రీహరి సీడీఎఫ్ నిధుల ద్వారా మంజూరు చేసిన మహిళా కమ్యూనిటీహాల్, యాదవ కమ్యూనిటీహాల్, ఖబరస్థాన్ ప్రహరీ నిర్మాణ పనులను సర్పంచ్ గాదెపాక సువర్ణ ఆయోధ్య, వైస్ ఎంపీపీ కొడారి కనకయ్య సోమవారం ప్రారంభించారు. ఉప సర్పంచ్ నాయిని నరేష్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన ప్రారంభోత్సవాలు, పథకాల పంపిణీలు

దేవరుప్పుల: ఎన్నికల కోడ్ వస్తుందన్న సమాచారంతో ఆఘమేగాల మీద మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనుల ప్రారంభంతోపాటు సంక్షేమ పథకాల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను ప్రజాప్రతినిధులు అందజేశారు. సోమవారం సింగరాజుపల్లిలో గ్రామ పంచాయతీ కార్యాలయ ప్రారంభం, మండల పరిషత్‌లో బీసీ, మైనార్టీ రుణ మంజూరు పత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బస్వ సావిత్రి మల్లేషం, వైస్ ఎంపీపీ కత్తుల విజయ్ కుమార్ రెడ్డి, సర్పంచ్ మల్లేష్, ఎంపీడీఓ ఉమామహేశ్వర్, ఎంపీఓ సురేష్ కుమార్, ఎంపీటీసీ జాకీర్, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లు ఐక్యంగా ఉండాలి



మాట్లాడుతున్న నీల రాజు

లింగాలఘణపురం: ముదిరాజ్‌లంతా ఐక్యంగా ఉండి అభివృద్ధి సాధించాలని జిల్లా చీఫ్ ప్రమోటర్ నీల రాజు కోరారు. సోమవారం మండల కేంద్రంలోని దీప్తి ఫంక్షన్ హాల్‌లో ముదిరాజ్‌ల మండల ఆత్మీయ సమ్మేళనం జిల్లా డైరెక్టర్ పిట్టల రాజు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రాజు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ముదిరాజ్‌ల సంక్షేమానికి ఉచిత చేపల పిల్లల పంపిణీ, మోపెడ్‌ల పంపిణీ చేసి ఆదుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు నీల గట్టయ్య మాట్లాడుతూ ముదిరాజ్ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి కట్ల సదానందంను తొలగించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నీల గోపాల్, ఉపాధ్యక్షులుగా చాపల నర్సయ్య, ఉస్తెపు రవి, ప్రధాన కార్యదర్శిగా కాశబోయిన ప్రభాకర్, కార్యదర్శిగా చెవ్వ యాకయ్య, సహాయ కార్యదర్శులుగా నీల రమేష్, కట్ల భాస్కర్, కోశాధికారులుగా గండెబోయిన నరేష్, దండు సిద్దులు, సభ్యులుగా రవి, శ్రీనువాసు, నరేష్, సత్తయ్య, నాగరాజు, ఉపేందర్, సిద్దులు, చంద్రమౌళి ఎన్నికయ్యారు.

విజయవంతం చేయండి



మాట్లాడుతున్న దశమంతరెడ్డి

జనగామ రూరల్: ములుగు జిల్లాలోని మేడారంలో ఈనెల 11వ తేదీన నిర్వహించే గిరిజన సభను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ. 900 కోట్లతో గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తున్నందున కృతజ్ఞత తెలిపేందుకు సభ నిర్వహిస్తున్నామన్నారు. దేశంలో ప్రధానికి ఎంతో ఆదరణ ఉందని, రాష్ట్రపతిని గిరిజన మహిళను చేయడం ఆయన పాలనకు నిదర్శనం అన్నారు. సమావేశంలో రమేష్, రాంకోటి, తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతం నేర్పించేందుకే 'బాలసంస్కార్'



బాలసంస్కార్ కేంద్రం వద్ద సోమేశ్వర్‌రావు

స్టేషన్‌ఘన్‌పూర్: మన వేదభాష, సంస్కృతి, సంప్రదాయాలను విద్యార్థులకు నేర్పించడమే బాలసంస్కార్ కేంద్రాల ముఖ్య ఉద్దేశ్యమని బాలసంస్కార్ కేంద్రాల ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ పూస్కూరి సోమేశ్వర్‌రావు అన్నారు. మండలంలోని ఇప్పగూడెం గ్రామంలో నిర్వహిస్తున్న బాలసంస్కార్ కేంద్రాన్ని ఆయన సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచభాషలకే మూలాధారమైన సంస్కృతం నేర్పించాలని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ కేంద్రాలను విస్తరిస్తున్నామన్నారు. శ్లోకాల పఠనంతో విద్యార్థుల్లో జ్ఞాపకశక్తి అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రతీ విద్యార్థి చిన్నతనం నుంచే సనాతన ధర్మం, సంప్రదాయ విలువలు నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శాతపురం స్వాతి, సాంబరాజు, సట్ల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం



చిల్పూరు: మల్కాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు పోలేపల్లి రంజిత్ రెడ్డి తన 40వ పుట్టిన రోజు సందర్భంగా సోమవారం హనుమకొండలోని రెడ్ క్రాస్‌లో 25వ సారి రక్తాదానం చేశాడు. కాగా, అతనితో పాటు మిత్రులు తాడగోని చంద్రశేఖర్ రక్తదానం చేశారు.

ఎమ్మెల్యే క్యాంపు ఎదుట ఎస్ఎఫ్ఐ ధర్నా



ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్: విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో డివిజన్ కేంద్రంలోని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య క్యాంపు కార్యాలయాన్ని సోమవారం ముట్టడించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి, ఎమ్మెల్యే రాజయ్యకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి యాకన్నరాథోడ్ మాట్లాడారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ముట్టడి, ధర్నా కార్యక్రమం ఉండగా మండల కార్యదర్శి తరుణ్‌నాయక్‌ను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేయడం అమానుషమన్నారు. ధర్నాలో ఎస్ఎఫ్ఐ నాయకులు రవళి, స్పందన, జాను, అరవింద్, అరుణ్‌కుమార్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మండల పరిషత్ ముట్టడి



పాలకుర్తి: నిరసన తెలుపుతున్న జీపీ కార్మికులు



స్టేషన్‌ఘన్‌పూర్: నినాదాలు చేస్తున్న కార్మికులు

పాలకుర్తి : కనీస వేతన చట్టం అమలు, ఉద్యోగ భద్రత తదితర డిమాండ్లతో సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడాన్ని నిరసిస్తూ గ్రామ పంచాయతీ కార్మికులు సోమవారం పాలకుర్తి మండల పరిషత్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఉద్యోగులు విధుల్లోకి వెళ్లకుండా అడ్డుకున్నారు. సుమారు నాలుగు గంటల పాటు ఉద్యోగులను కార్యాలయంలోకి వెళ్లకుండా నిలువరించడంతో పోలీసులు చేరుకొని ఎంపీడీఓతో మాట్లాడించి.. ప్రభుత్వానికి నివేదిక పంపుతామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చిట్యాల సోమన్న మాట్లాడుతూ.. జేఏసీ నేతలతో చర్చల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రి దయాకర్‌రావు జీపీ సిబ్బందికి ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తీసుకువచ్చిన మల్టీపర్పస్ విధానాన్ని వెంటనే రద్దు చేయకుండా అత్యధికంగా విధుల్లో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ అట్టడుగు వర్గాలు సిబ్బందిపై బీఆర్ఎస్ సర్కారు వివక్ష చూపుతోందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో జీపీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు కుక్కల సోమన్న, శ్రీను, కుమార్, బాలు, పోగు అయోధ్య, సుశీల, రాములు, రమేష్, పరంజ్యోతి, కృష్ణాచారి, సంతోష్, నాగరాజు, నరేష్, యాకన్న, అరుణ, శేఖర్, రాము, అజీమా తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

స్టేషన్‌ఘన్‌పూర్: గ్రామ పంచాయతీ కార్మికులు, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక గ్రామ పంచాయతీ కార్మికులు సోమవారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం సీఐటీయూ జిల్లా నాయకుడు కొడెపాక యాకయ్య మాట్లాడుతూ గతంలో జీపీ కార్మికులు, ఉద్యోగులు 35 రోజుల సమ్మె చేసిన సమయంలో మంత్రి దయాకర్‌రావు చేసిన హామీలు ఇంతవరకూ అమలుకు నోచుకోలేదన్నారు. ఇప్పటికైనా స్పందించి మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, కనీస వేతనాలు అందించాలని, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ కార్మికులు కుంభం రాజు, గుర్రం లాజర్, స్వామి, చంద్రమౌళి పాల్గొన్నారు.

బహుజనుల రాజ్యాధికారమే బీఎస్పీ లక్ష్యం

పాలకుర్తి: జనాభా దామాషా ప్రకారం బహుజనుల రాజ్యాధికారమే బీఎస్పీ లక్ష్యమని ఆ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ నాయకుడు బండిపెల్లి యాదగిరి అన్నారు. సోమవారం మండలంలోని లక్ష్మీనారాయణపురంలో బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్షీరాం 17వ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమర వీరుల త్యాగాల ఫలితంగా పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో దొరల పాలన కొనసాగుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ బహుజనలంతా ఏకమై తెలంగాణలో బహుజన రాజ్యాధికార సాధనలో భాగంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాపాక శ్రీశైలం, ఉపాధ్యక్షుడు పడమటింటి భాస్కర్, నాయకులు సింగారపు రవీందర్, మహిళా కమిటీ నాయకురాలు చీటూరి రమ, రాజేశ్వరి, పాలకుర్తి మండల అధ్యక్షుడు చెరుపెల్లి కుమార్, యాసారపు ప్రవీణ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ సభకు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు



దేవరుప్పుల: సభకు తరలుతున్న నాయకులు



పాలకుర్తి నుంచి..

దేవరుప్పుల: తొర్రూరులో తలపెట్టిన కేటీఆర్ బహిరంగ సభకు మంత్రి దయాకర్ రావు పర్యవేక్షణలో మండల వ్యాప్తంగా భారీ సంఖ్యలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్ష కార్యదర్శులు తీగల దయాకర్, చింత రవి, పల్ల సుందర్‌రామిరెడ్డి, బసవ మల్లేష్, బబ్బూరి శ్రీకాంత్‌గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ రామ్ సింగ్ మండల అధికార ప్రతినిధి సుడిగాల హనుమంతు, ఈదునూరి నరసింహారెడ్డి, ఎలసోమసుందర్, కొత్త జలంధర్‌రెడ్డి, అర్జున్, ప్రవీణ్, ఎంపీపీ బసవ సావిత్రి వైస్ ఎంపీపీ విజయ్ కుమార్ రెడ్డి, గద్దం రాజు, నవీన్ పాల్గొన్నారు.

పాలకుర్తి నుంచి..

పాలకుర్తి: తొర్రూరులో సోమవారం నిర్వహించిన మంత్రి కేటీఆర్ బహిరంగ సభకు పాలకుర్తి నుంచి బీఆర్ఎస్ శ్రేణులు తరలివెళ్లారు. మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

గ్యారంటీ పథకాలపై కాంగ్రెస్ ప్రచారం



రఘునాథపల్లి: గ్యారంటీ పథకాలను వివరిస్తున్న ఎంపీపీ వరలక్ష్మి



లింగాలఘణపురం: మాట్లాడుతున్న దొమ్మాటి సాంబయ్య

రఘునాథపల్లి: కాంగ్రెస్ అధిష్టానం ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలపై పార్టీ మండల ఆధ్వర్యంలో సోమవారం కుర్చపల్లి, కోమళ్ల, గోవర్ధనగిరిలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అయా గ్రామాల్లో ఎంపీపీ మేకల వరలక్ష్మి మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో అన్ని వర్గాలకు తీరని నష్టం జరిగిందన్నారు. ప్రజలకు భారంగా ఉన్న బీఆర్ఎస్‌ను గద్దె దించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే సంక్షేమం సాధ్యమని, అధికారంలోకి రాగానే అన్ని వర్గాలకు మేలు చేకూరుతుందన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్, జిల్లా నాయకులు మేకల నరేందర్, గాదె మహేందర్‌రెడ్డి, ఎంపీటీసీ అల్లిబిల్లి కృష్ణ, నీలం యువరాజ్, కావటి భాస్కర్ యాదవ్, తోటకూరి రమేష్ పాల్గొన్నారు.

'గ్యారంటీ'లు అమలు ఖాయం

లింగాలఘణపురం: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ స్కీంలు అమలు చేస్తామని పీసీసీ ఉపాధ్యక్షుడు దొమ్మాటి సాంబయ్య అన్నారు. ఆదివారం రాత్రి మండలంలోని నేలపోగులలో సాంస్కృతిక సేన ఆధ్వర్యంలో దూందాం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ తెలంగాణ ప్రజలను మోసం చేశాడని, తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాలు తప్పకుండా అమలు చేస్తామని అన్నారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో సాంస్కృతిక సేన రాష్ట్ర అధ్యక్షుడు చక్రాల రాగన్న, నేలపోగుల ఎంపీటీసీ, సాంస్కృతిక సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సయ్య, సాంస్కృతిక సేన జిల్లా అధ్యక్షుడు శ్రీనువాస్ తదితరులు పాల్గొన్నారు.

'అవకాశమివ్వండి.. ఐదేళ్లు సేవ చేస్తా'



సమావేశంలో మాట్లాడుతున్న ఝాన్సీరెడ్డి

కొడకండ్ల : రాజకీయాలకు రాకముందే అనేక సేవా కార్యక్రమాలు చేపట్టాను.. ఎన్నికల్లో ఆదరిస్తే ఐదేళ్లు మీ కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ సేవ చేస్తానని కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధి గిర్నితండా, మైదంచెరువుతండా, మొండ్రాయి గ్రామాల్లో నిర్వహించిన సంకల్పయాత్రలో ఆమె మాట్లాడారు. మూడుసార్లు అవకాశమిస్తే దయలేని దయాకర్‌రావు చేసింది శూన్యం.. మరోసారి మాయమాటలకు మోసపోతే గోసపడక తప్పదని ప్రజలకు సూచించారు. కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం.. ప్రతి ఇంటా సంక్షేమం.. ఆనందం చేకూరుతుంది.. ఆరు గ్యారంటీ పథకాలను పేదల కోసమే రూపొందించినట్లు చెప్పారు. అధికార పార్టీ నాయకుల బెదిరింపులకు భయపడాల్సిన అవసరం లేదు.. కార్యకర్తల జోలికొస్తే సహించబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో బ్లాక్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు సత్యనారాయణ, సురేష్‌నాయక్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు రాజేష్‌నాయక్, సోమనర్సయ్య, రవీందర్, సిద్ధు, భిక్షపతి, యాకేష్, శ్రీవర్థ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

పాలకుర్తి: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే సబ్బండ వర్గాలకు రాజ్యాధికారం దక్కుతుందని హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని గూడూరుకు చెందిన బీఆర్ఎస్, సీపీఎంకు చెందిన పలువురు నాయకులు ఆమె సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ప్రజాస్వామ్యయుతమైన పాలన కొనసాగాలంటే బీఆర్ఎస్‌కు ప్రజలు గుణపాఠం చెప్పాలని ఆమె పిలుపునిచ్చారు. తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ నాయకత్వాన్ని బలపర్చి ఉద్యోగ, ఉపాధి కల్పన లోటును తీర్చుకుందామన్నారు. రాపాక సత్యనారాయణ, అనుముల మహేందర్, బెల్లి దేవేందర్ పాల్గొన్నారు.


నర్మెట సీఐగా సాయిరమణ, ఎస్సైగా శ్రీకాంత్

నర్మెట: నర్మెట సీఐగా మినుకూరి సాయి రమణ, ఎస్సైగా కన్నెబోయిన శ్రీకాంత్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. కాగా, హనుమకొండకు చెందిన 2004 బ్యాచ్ సాయిరమణ 2013లో సీఐగా పదోన్నతి పొంది చర్ల, ములుగు, ఖమ్మం, చిట్యాలలో లాఅండ్ ఆర్డర్, సీసీఎస్, ఎస్‌బీలో విధులు నిర్వహించారు. పైడిపల్లికి చెందిన కన్నెబోయిన శ్రీకాంత్ (2012 బ్యాచ్) కరీనంగర్, పెగడపల్లి, పర్కాల, వరంగల్ ట్రాఫిక్, ఎస్‌బీలో విధులు నిర్వహించి బదిలీపై నర్మెటకు వచ్చారు.

నేడు ఎమ్మెల్సీ కడియం పర్యటన

రఘునాథపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ అభ్యర్థి కడియం శ్రీహరి బుధవారం బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశాల్లో పాల్గొంటారని జిల్లా రైతుబంధు సమితి సభ్యుడు మారుజోడు రాంబాబు తెలిపారు. మంగళవారం ఆయన కడియం పర్యటన వివరాలు వెల్లడించారు. మండలగూడెం, రామరాయనిబంగ్లా, మేకలగట్టు, జాఫర్‌గూడెం, అశ్వరావుపల్లి, వెల్లి గ్రామాల్లో గ్రామస్థాయి విస్తృత సమావేశాల్లో పాల్గొంటారని, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిదులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఎమ్మెల్యే రాజయ్యకు శుభాకాంక్షల వెల్లువ



రాజయ్యకు బొకే ఇస్తున్న ఎమ్మెల్సీ పల్లా

స్టేషన్‌ఘన్‌పూర్/చిల్పూరు/రఘునాథపల్లి: రాష్ట్ర రైతుబంధు సమితి అధ్యక్షుడిగా సోమవారం బాధ్యతలు చేపట్టిన స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్యను హైదరాబాద్‌లో పలువురు నేతలు కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డితో పాటు జెడ్పీస్టాండింగ్ కమిటీ చైర్మన్ మారపాక రవి, బీఆర్ఎస్ జిల్లా నాయకులు ఆకుల కుమార్, మాచర్ల గణేష్, ఎంపీటీసీ గన్ను నర్సింహులు, తోట సత్యం, గట్టు మనోహర్, అశోక్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే చిల్పూరుగుట్ట ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, శ్రీపతిపల్లి గ్రామానికి చెందిన మూడు గ్రామాల సాగునీటి సాధన కమిటీ కన్వీనర్ కేశిరెడ్డి మనోజ్‌రెడ్డి, రఘునాథపల్లి మండల అధ్యక్షుడు వారాల రమేష్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై కుమార్‌గౌడ్, కుర్ర కమలాకర్‌గౌడ్ తదితరులు రాజయ్యకు శుభాకాంక్షలు తెలిపారు.

కళాశాల కమిటీ ఎన్నిక



మాట్లాడుతున్న అభిగౌడ్

జనగామ రూరల్: రాష్ట్రంలో విద్యార్థులను, యువతకు అన్యాయం చేస్తున్న పార్టీ బీఆర్ఎస్ పార్టీని ఓడించి తెలంగాణను ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అభిగౌడ్ అన్నారు. ఏకశిల డిగ్రీ కళాశాలలో సోమవారం కళాశాల కమిటీని ఎన్నుకున్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వేణు గోపాల్ కీర్తి ప్రియ, ప్రెసిడెంట్‌గా రాజేశ్వరీ, వైస్ ప్రెసిడెంట్‌గా మహేష్, ప్రధాన కార్యదర్శిగా లింగా నాయక్ ఎన్నికయ్యారు. నాయకులు ధీరజ్, కార్తిక్ తదితరలు పాల్గొన్నారు.